క్లుప్తంగా

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



ఐరాల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా ధనలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ నాగరాజు పూతలపట్టుకు బదిలీ అయ్యారు. పూతలపట్టులో పనిచేస్తున్న ధనలక్ష్మి ఇక్కడికి వచ్చారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఎంపీడీఓ పేర్కొన్నారు.

పూతలపట్టు ఎంపీడీఓగా నాగరాజు



పూతలపట్టు: నూతన ఎంపీడీవోగా నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేసిన ధనలక్ష్మి ఐరాలకు బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న నాగరాజు పూతలపట్టుకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఇంటి వద్దకే వైద్యం



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ అనూష

గుడిపాల: గ్రామాల్లో ప్రజల ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్నట్లు బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష తెలిపారు. నంగమంగళం గ్రామంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం బీపీ, షుగర్ ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే వైద్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది శ్రీలత, పవిత్ర, రూబి, సరిత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం ఎంపీడీఓగా చంద్రమౌళి



కార్వేటినగరం: మండల అభివృద్ధి అధికారిగా చంద్రమౌళి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో నగరి నియోజకవర్గంలోని విజయపురం మండలం ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వం ఆదేశాల మేరకు కార్వేటినగరం ఎంపీడీఓగా వచ్చినట్లు తెలిపారు. నూతన ఎంపీడీఓగా పదవీ బాధ్యతలు చేపట్టిన చంద్రమౌళి మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మండల పరిధిలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడానికి సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీఓ చంద్రమౌళిని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

రాహుకాలం.. రిజిస్ట్రేషన్ ఆలస్యం

- ముహూర్తం బాలేదని బాధ్యతలు స్వీకరించని ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్
- కిక్కిరిసిన కార్యాలయం
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిపాలన అస్తవ్యస్తం



ఖాళీగా దర్శనమిస్తున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న కొనుగోలు, విక్రయదారులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. ఎక్కువకాలం ఇన్‌చార్జిలతోనే పాలన కొనసాగిస్తున్నారు. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా రావడానికి ఎవరు ఆసక్తి చూపకపోవడం, ఉన్నవారు సెలవుపై వెళుతుండడంతో ఆ ప్రభావం వినియోగదారులపై పడుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ డ్యూటీ ఎక్కకపోవడంతో కొనుగోలు, విక్రయదారులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిండిపోయింది. రాహుకాలం అయ్యాక ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకుని సేవలు ప్రారంభించారు.

ఇన్‌చార్జిలే దిక్కు

జిల్లా కేంద్రంలోని చిత్తూరు అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జిలతో పాలన దిక్కుగా మారింది. గతంలో సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న శ్రీధర్ గుప్తా భూ వివాదంలో సస్పెండ్ అయి తిరిగి పోస్టింగ్ తెచ్చుకొని కర్నూలుకు వెళ్లారు. అప్పటి నుంచి సమస్య మొదలైంది. అర్బన్ కార్యాలయానికి రావాలంటేనే అధికారులు జంకుతున్నారు. ఇక్కడ రైటర్లు బాగా ముదిరిపోయారు. వారు చేసే పాపాలకు ఉద్యోగం ఎందుకు బలి కావాలి అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తర్వాత సీనియర్ సహాయకులు వినోద్, చలపతి ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లుగా బాధ్యతలు నిర్వహించారు. తదుపరి రహంతుల్లాను రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీల్లో ఇక్కడికి వచ్చారు. వచ్చి కొద్ది నెలల తర్వాత మెడికల్ సెలవు పెట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో రహంతుల్లా పాకాలకు వెళ్లగా, సీనియర్ సహాయకులు అయిన వినోద్, చలపతి కుప్పం, మదనపల్లెకు మారారు. సెప్టెంబర్ 27న కార్వేటినగరం సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న అశోక్ బదిలీపై చిత్తూరుకు వచ్చారు. ఆయన ప్రస్తుతం సెలవు పెట్టడంతో ఇన్‌చార్జిగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ సహాయకులు హేమంత్‌ను నియమించారు. ఆయన పలు కారణాలతో మధ్యాహ్నం తర్వాత సీటులో కూర్చున్నారు.

ప్రత్యామ్నాయం ఏది?

పలు నెలలుగా ఇన్‌చార్జిలతోనే పాలన నెట్టుకొస్తున్నారు. ఇన్‌చార్జిలంటే తక్కువని కాదు.. జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెగ్యులర్ అధికారి ఉంటే పాలనకు ఇబ్బంది ఉండదు. దీంతో పాటు తర్వాత క్యాడర్ ఉద్యోగులకు పని భారం ఉండదు. బదిలీల్లో పలువురు సీనియర్ సహాయకులను సబ్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. కానీ అందులో ఇంక పలువురికి సీట్ల మీద స్పష్టమైన క్లారిటీ లేదు. ప్రస్తుత సబ్‌రిజిస్ట్రార్ అశోక్ డిసెంబర్‌లో పదవీ విరమణ చేయనున్నారు. అంతవరకు ఆయనకున్న సెలవులను వాడుకోనున్నట్లు తెలుస్తోంది. అంతే అప్పటి వరకు ఆయన సీటులో కూర్చునే అవకాశం లేదు. అటువంటప్పుడు ప్రత్యామ్నాయంగా ఆ సీటుకు ఉద్యోగిని కేటాయించాల్సి ఉంది. లేని పక్షంలో పాలన అస్తవ్యస్తంగా మారుతుంది. దీనిపై ఇన్‌చార్జి జిల్లా రిజిస్ట్రార్ మునిశంకరయ్యను ప్రశ్నించగా అశోక్ సెలవు పెట్టడంతో ఇన్‌చార్జి బాధ్యతలు హేమంత్‌కు ఇచ్చామన్నారు. ఇక మీదట సేవలు ఆలస్యం కాకుండా చూస్తామని వివరించారు.

చిత్తశుద్ధితో హామీలు అమలు చేయాలి



ఇసుకను ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న సీఐటీయూ నేతలు

చిత్తూరు కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం చిత్తూరు జిల్లాలోని పూతలపట్టు మండలం బండపల్లిలో ఉచితంగా ఇసుక సరఫరా చేయాలనే డిమాండ్‌తో సీఐటీయూ, ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇసుక సరఫరా లేకపోవడం వల్ల భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఆదాయం లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇసుక ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు డబ్బులు వసూలు చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ధర్నాలో గంగాధరం, సరోజా, కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: గ్రామీణ ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే ఆరోగ్యకరమైన జీవితం పొందవచ్చని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని మొరంపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. దోమకాటు వల్ల సంభవించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు



బంగారుపాళెం: తుంబపాళెంలో ఆక్రమణకు గురైన కుంటను పరిశీలిస్తున్న తహసీల్దార్

బంగారుపాళెం: మండలంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. తుంబపాళెంలో ఆక్రమణలకు గురైన కుంటను పరిశీలించారు. ఈ కుంటపై కేసు హైకోర్టులో నడుస్తోందన్నారు. మండలంలోని కరిపిరెడ్డిపల్లె ఎస్టీ శ్మశాన స్థలాన్ని సర్వేయర్ లావణ్యతో కలసి పరిశీలించారు. తగాదాలో ఉన్న శ్మశాన స్థలాన్ని సర్వే చేసి 30 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓలు నవీన్, చంద్రయ్య, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా నీవా వంతెన

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని నీవా నది వంతెన దుస్థితికి చేరుకుని ప్రమాదకరంగా మారింది. నీవా వంతెనపై భారీ గుంత ఏర్పడింది. చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై వందలాది వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇదే దారిలో స్కూళ్లు, కళాశాల వాహనాలు చిత్తూరుకు వెళ్తుంటాయి. అయితే ప్రస్తుతం వంతెనపై ఏర్పడ్డ భారీ గుంత కారణంగా రోడ్డు ప్రమాదాలు తప్పేటట్టు లేవు. వంతెన గోడ గతంలో ఒక వాహనం ఢీకొని ఒకవైపు కూలిపోయింది. ఈ గోడ పూర్తిగా ధ్వంసం కావడంతో గుంతను తప్పించబోయి వంతెన కింద పడిపోయే ప్రమాదం ఉంది. దీనిపై స్థానికులు ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పౌష్టికాహారం



ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు భోజనం అందిస్తున్న డాక్టర్లు

బంగారుపాళెం: స్థానిక సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు శుక్రవారం నుంచి పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష తెలిపారు. వివిధ జబ్బుల కారణంగా ఆస్పత్రిలో చేరిన వారికి ఉదయం, మధ్యాహ్నం, రాత్రి టిఫిన్, భోజనం అందించనున్నట్లు తెలిపారు. రోగులకు పెట్టే భోజనంలో లోపాలు తలెత్తితే చర్యలు తప్పవని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్లు శాలిని, స్వరూప్, అఖిల్, హెడ్ నర్సులు సుమతిభాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు ఐరన్ మాత్రలు తప్పనిసరి



ఎగువ తవణంపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవ నారాయణ



ఎగువ మత్యంలో గర్భిణులకు సూచనలిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: గర్భిణులు రక్తహీనత రాకుండా ఐరన్ మాత్రలు తప్పక వాడాలని వైద్యాధికారి వినయ్ కుమార్ తెలిపారు. మండలంలోని ఎగువ తవణంపల్లె, ఎగువ మత్యం గ్రామాల్లో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్యసేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ కేశవ నారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యం చేయించుకోవాలని వివరించారు. దోమలు వ్యాప్తి చెందకుండా లార్వా దశలో ఉన్నప్పుడే వాటిని అరికట్టాలని తెలిపారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచితంగా భూసార పరీక్షలు

చౌడేపల్లె: డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ హైదరాబాద్ సహకారంతో ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించి లోపాలను రైతులకు తెలియజేస్తామని ఉద్యానశాఖ డీడీ మధుసూదనరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పెద్దపంజాణి, గంగవరం మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రం సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతు సేవా కేంద్రానికి ఒక కిట్ ఇచ్చామన్నారు. వీటితో 50 మంది రైతుల పొలాల్లో భూసార పరీక్షలను నిర్వహిస్తామన్నారు.

సబ్‌స్టేషన్‌లో చెట్లు మాయం!

- ఇంటి దొంగల చేతివాటం
- లక్షలాది విలువ చేసే చెట్లు నరికివేత
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



అకేషా చెట్లను కోసి వేసిన దృశ్యం



చిట్రెడ్డిపల్లె సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద నరికేసిన వేప, అకేషా చెట్లు

చౌడేపల్లె: మండల కేంద్రంలో చిట్రెడ్డిపల్లె సమీపంలోని సబ్‌స్టేషన్‌లో విలువైన కలప చెట్లు మాయం అవుతున్నాయి. సుమారు 20 ఏళ్ల నాటి వృక్షాలను అక్కడి సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. లక్షలాది రూపాయల విలువ చేసే అకేషా, వేప చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. రాత్రికి రాత్రే చెట్లను మొదలు వరకు కోసేసి మాయం చేస్తున్నారు. సబ్‌స్టేషన్‌లో మిగిలి ఉన్న వృక్షాలైనా నరికివేతకు గురికాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై ట్రాన్స్‌కో ఏఈ శశిధర్‌ను సెల్‌ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

చాముండేశ్వరిగా దుర్గామాత చిద్విలాసం..!

- కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు
- గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన గంగమ్మ



చిత్తూరు: చాముండేశ్వరిగా దుర్గాంబ



బంగారుపాళెం: బాలాత్రిపురసుందరిదేవిగా ముత్యాలమ్మ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా దుర్గామాత చాముండేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. గిరింపేటలోని శ్రీదుర్గాంబ దేవస్థానంలోని మూలవిరాట్‌కు ఉదయం అభిషేకం చేశారు. రాత్రి మండపంలో చాముండేశ్వరిగా కొలువుదీరి భక్తులను కటాక్షించారు. గుర్రప్పనాయుడువీధిలోని అంకాళపరమేశ్వరి ఆలయంలో ఉదయం పసుపు అలంకారం, రాత్రి కాశీ విశాలాక్షి అలంకారం, కట్టమంచిలోని శ్రీవిశ్వ షిరిడీ సాయిబాబా ఆలయంలో గాయత్రిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు కనువిందు చేశారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గాయత్రిదేవిగా వజ్రాలపురం గంగమ్మ

బంగారుపాళెం: దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ శుక్రవారం శ్రీగాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు గంగమ్మను ప్రత్యేకంగా అంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నల్లంగాడుకు చెందిన వాణి హరిబాబు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, మేనేజరు మొగిలప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలా త్రిపురసుందరిగా ముత్యాలమ్మ

దసరా, దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బంగారుపాళెం గ్రామదేవత ముత్యాలమ్మ శ్రీ బాలా త్రిపుర సుందరి అలంకారంలో భక్తులను కనువిందు చేశారు. ఉదయం ముత్యాలమ్మ మూలవిగ్రహానికి పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మురళీగురుకుల్ అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొగిలివెంకటగిరిలో..

మండలంలోని మొగిలివెంకటగిరిలోని గంగమ్మ శుక్రవారం పార్వతీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు జగదీష్‌స్వామి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రులు

ఐరాల: మండలంలోని ఆలయాల్లో దేవీశరన్నవరాత్రుల మహోత్సవాల్లో భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. రెండో వరోజు శుక్రవారం స్థానిక గ్రామ దేవత పాలేటమ్మ ఆలయంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి విశేషంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. వైఎస్.గేటులో చాముండేశ్వరి అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చాముండేశ్వరి అలంకరణలో దుర్గమ్మ

గుడిపాల: మండలంలోని శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం వేడుకగా నిర్వహించారు. కందగిరి కొండవద్ద ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవాలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం మూలస్థాన దుర్గమ్మ చాముండేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పల్లూరులోని గంగమ్మ అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.









ఐరాల: బాలాత్రిపుర సుందరిగా, గాయత్రీదేవిగా, బంగారుపాళెం: గాయత్రీదేవిగా, మొగిలివెంకటగిరి గంగమ్మ, చిత్తూరు: కాశీవిశాలాక్షిగా అంకాళపరమేశ్వరి, సాయిబాబా గుడిలో గాయత్రీదేవిగా..., గుడిపాల: చాముండేశ్వరీ దేవిగా